క్లుప్తంగా

94 శాతం పంట నమోదు పూర్తి



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో ప్రతాప్

కలువాయి: మండలంలో 94 శాతం పంట నమోదు పూర్తయిందని వ్యవసాయాధికారి వి.ప్రతాప్ తెలిపారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టమైతే పరిహారం అందుతుందన్నారు. వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ కింద పూర్తి రాయితీతో ఎలుకల మందు అందజేస్తున్నామని తెలిపారు. వరిలో అధిక మొత్తంలో యూరియా వాడడం వల్ల అగ్గితెగులు వస్తుందని, యూరియాతో పొటాష్ కలిపి తక్కువ మోతాదులో వాడుకోవాలన్నారు. సిబ్బంది నరేష్‌కుమార్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి

రాపూరు: రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయ అధికారి సోమసుందరం తెలిపారు. మండలం తెగచర్ల, గోనుపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికంగా రసాయనిక ఎరువులను వినియోగించడం వలన పంట దెబ్బతింటుందన్నారు. రైతులు వరి పంటలో ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

కొలిక్కిరాని దారి వివాదం

చిల్లకూరు : మండలంలోని బూదనంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న దారి వివాదం కొలిక్కి రాలేదు. దారి విషయంపై బుధవారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇందులో కొంతమంది మాత్రమే పాల్గొన్నారు. దీంతో అధికారులు చేసేది లేక ఉన్న వారితోనే సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రికార్డుల ప్రకారం దారి లేదన్నారు. ఒక వ్యక్తి స్థలం గుండా నడిచేవారని తెలిపారు. ఇప్పుడు ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడడంతో దారి ఇవ్వడం లేదని, ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆర్ఐ పూర్ణ, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు కృషి

సైదాపురం: గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో భాగంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించి ఉపాధి హామీ, ఎస్‌బీఎం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామాజిక సోక్‌పిట్స్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకుడు గుంతలు, సామాజిక సోక్‌పిట్స్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ప్రతి గ్రామ పంచాయతీని 2026 మార్చి 31వ తేదీలోగా ఓడీఎస్ ప్లస్ విలేజ్‌గా డిక్లేర్ చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని మేరీ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు బుధవారం నాయుడు పేట పట్టణానికి చెందిన చిల్లకూరు ప్రభావత మ్మ తన మనవడు కే విక్రమ్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు బెన్ని పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులోనున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం మౌని అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కోనేరులో తెప్పోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. అంతకుముందు గ్రామోత్సవం చేపట్టారు. తదుపరి తెప్పోత్సవం నిర్వహించారు. ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి దంపతులు, జయరామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన కర్రబల్లవోలు, చిలమానుచేను, పండూర్లు, సగుటూరు గ్రామాల ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో రవికృష్ణ పర్యవేక్షించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న హెచ్‌ఎం

దక్కిలి: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని దక్కిలి కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజ తెలిపారు. ఆయన బుధవారం వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. హెచ్‌ఎం డి.పెంచలయ్య, ఉపాధ్యాయుడు తేజోవర్మ, ఈఆర్పీ అనిత పాల్గొన్నారు.

న్యూ ఎస్సీ కాలనీలో కొంత భాగమే వేసిన సీసీ రోడ్డు



అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చని కూటమి నేతలు నిరూపిస్తున్నారు. పల్లె పండుగ కింద మంజూరైన సీసీ రోడ్లను తమ సొంత స్థలాలు, ప్రైవేట్ లేఅవుట్ల వద్దకు వేసుకుంటున్నారు. వారికి అధికారులు వంత పాడుతున్నారు. దీంతో పేదలు బురదమయమైన వీధులతోనే కాలం వెల్లదీయాల్సి వస్తోంది.



అప్రూవల్ లేని లేఅవుట్‌లో వేసిన సీసీ రోడ్డు

ప్రైవేట్ లేఅవుట్లకు సీసీ రోడ్లు

- పల్లె పండుగలో సీసీ రోడ్లు వేసుకుంటున్న వైనం
- యథేచ్ఛగా అధికార దుర్వినియోగం
- కూటమి నేతలకు వంత పాడుతున్న అధికారులు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని 19 పంచాయతీలకు పల్లె పండుగ కింద 18 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇందుకోసం ఉపాధి హామీ నిధులు రూ.1.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అదనంగా మరో రూ.56 లక్షలతో 10 సీసీ రోడ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చింది. గత ఏడాది నవంబర్‌లో పనులు ప్రారంభించి సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశించింది. 20 చోట్ల సీసీ రోడ్ల పనులు పూర్తి చేశారు. కేసీఎన్ గుంట, యడబాళెం, కుదిరి, కొరిడి, కడపత్ర, అటకానితిప్ప, ఆబాక, మతకాముడి గ్రామాల్లో 8 సీసీ రోడ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రోడ్ల నిర్మాణంలో కూటమి నేతలు చేతివాటం చూపారు. పేదల కాలనీల్లో మంజూరైన రోడ్లలో వంద మీటర్లు ఒక చోట వేసి మరొక చోట తమకు అనుకూలంగా రోడ్డు వేసుకున్నారు. ముఖ్యంగా సొంత స్థలాలు, ప్రైవేటు లేఅవుట్లకు వెళ్లే ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. మన్నేముత్తేరి పంచాయతీ న్యూ ఎస్సీకాలనీలోని జగనన్న లేఅవుట్, యడబాళెం ప్రాంతాల్లో రెండు చోట్ల సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇందులో న్యూ ఎస్సీ కాలనీలోని జగనన్న లేఅవుట్‌లో సుమారు 150 మీటర్ల మేర సీసీ రోడ్డుకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన అధికారులు 100 మీటర్లు సీసీ రోడ్డు వేసి మిగిలిన 50 మీటర్లు అదే పంచాయతీలోని కూటమి నేతల అండదండలతో మదిలేటమ్మ ఆలయం వద్ద ఉన్న ప్రైవేట్ లేఅవుట్ వద్ద వేశారు. దీనిపై గ్రామస్తులు అధికారులు, కూటమి నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల కాలనీల్లో జరగాల్సిన అభివృద్ధి పనులకు కూడా కూటమి నాయకులు అడ్డు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ నిధులు ప్రైవేట్ లేఅవుట్లకు వేయడటం ఏమిటని ఆరోపిస్తున్నారు.



కేసీఎన్‌గుంటలోని రోడ్డు దుస్థితి

కాలనీలో పూర్తి స్థాయి రోడ్డు వేయలేదు



మా కాలనీకి రోడ్డు మంజూరైంది. బాధలు తప్పుతాయని భావించాం. అధికారులు కొంత భాగమే రోడ్డు వేశారు. రికార్డుల్లో మాత్రం పూర్తిగా వేసినట్టు రాసుకున్నారు. మరో సగ భాగం రోడ్డు కూటమి నేతలకు అనుకూలంగా మరో చోట వేశారు. ఇదేమిని అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు.

\- సురేష్, మన్నేముత్తేరి, సూళ్లూరుపేట మండలం

మిగిలిందని వేశాం

న్యూ ఎస్సీ కాలనిలోని జగనన్న లేఅవుట్‌లో సీసీ రోడ్డు వేశాం. అక్కడ మంజూరైన భాగంలో మిగిలిందని మదిలేటమ్మ గుడి వద్ద వేశాం. అది ప్రైవేట్ లేఅవుట్ అని మాకు తెలియదు. ఆ ప్రాంతంలో గ్రామానికి చెందిన కొంతమంది నివాసం ఉంటున్నారు. అందువల్లే రోడ్డు వేశాం. ప్రారంభం కాని పనులను త్వరలోనే పూర్తి చేస్తాం.

\- కౌశల్య, పంచాయతీ రాజ్ ఏఈ, సూళ్లూరుపేట

1, 2 తేదీల్లో బాలికల కబడ్డీ టోర్నమెంట్

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని బాలికలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 16 ఏళ్లలోపు బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విజేతలు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలతోపాటు షీల్డ్‌లు అందజేస్తామన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 169 మంది హాజరు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షకు 169 మంది హాజరైనట్లు పరిశీలకుడు కిషిందర్ తెలిపారు. ఉదయం పరీక్షకు 85 మంది, మధ్యాహ్నం పరీక్షకు 84 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు

కోట: పట్టా భూముల్లో గ్రావెల్ తవ్వకాలపై గూడలి అరుంధతీయ కాలనీవాసులు బుధవారం తహసీల్దార్ జయజయరావుకు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వం గూడలికొండ దిగువ ప్రాంతంలో భూపంపిణీ చేసిందని తెలిపారు. ఆ భూమిలో విలువైన గ్రావెల్ ఉందని పేర్కొన్నారు. దీనిపై కన్నేసిన కొందరు అధికార పార్టీ నాయకులు అనుమతులు తీసుకోకుండానే గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ విచారణ జరిపి తవ్వకాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పీహెచ్‌సీ తనిఖీ

గూడూరు రూరల్ : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం చెన్నూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయం వారీగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. డాక్టర్ జ్యోతి నాగేంద్ర కుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, సూపర్‌వైజర్ మస్తానయ్య, నగేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు ఇస్తున్న వారిని అరెస్టు చేయాలి

చిల్లకూరు : నకిలీ విత్తనాలు సాగు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇలాంటి విత్తనాలు సరఫరా చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసారు. వారు బుధవారం గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంపై నిందలు మోపే నేటి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉండాల్సింది పోయి నకిలీ విత్తనాలను అంటగట్టిందని ఆరోపించారు. పంట ఎదుగుదల లేక రైతులు లబోదిమంటున్నారని తెలిపారు. నాలుగు నెలలకు కూడా దిగబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. గతంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటుచేసి విత్తనాలను పరీక్షించిన తర్వాతే సరఫరా చేసేవారని తెలిపారు. తద్వారా నకిలీ విత్తనాలు సాగు చేసిన రైతులు పంట ఎదుగుదల లేకపోవడంతో ఎక్కువగా మందులు వాడాల్సి వస్తోందని తెలిపారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సీహెచ్ ప్రభాకర్, కాలేషా, శశికుమార్, కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, చిల్లకూరు వేమయ్య, గుంటమడుగు సుబ్బారాజు, రాపూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచాలి

పెళ్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పెళ్లకూరు, కొత్తూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. చదువు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు.



పెళ్లకూరు పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న తహసీల్దార్

పలువురికి పరామర్శ

వెంకటగిరి రూరల్/దక్కిలి : వెంకటగిరి పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి తండ్రి చిల్లకూరు శివరామిరెడ్డి ఉత్తర క్రియలు బుధవారం నిర్వహించారు. ఇందులో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. శివరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బాలాయపల్లి మండలం మన్నూరులో ఇటీవల మృతి చెందిన కాటూరు ప్రసాద్‌రెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే డక్కిలి మండలం మాటుమడుగు, పాతనాలపాడు గ్రామాలకు వెళ్లి ఇటీవల మృతిచెందిన రేవూరు భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఘట్టమనేని రంగయ్య నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బాలాయపల్లి మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, కాటూరు రామతులసి, వైఎస్సార్‌సీపీ డక్కిలి మండల కన్వీనర్ చింత శ్రీనివాసులురెడ్డి, పి.దశరథరామిరెడ్డి, పిల్లి రామసుబ్బారెడ్డి, నర్రావుల వేణు నాయుడు, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్నూరులో గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



చిల్లకూరు శివరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రంగయ్య నాయుడుకు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైద్య వీరరాఘవుల స్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని చలివేంద్రం గ్రామం వద్ద ఉన్న వైద్య వీరరాఘవుల స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఏడాదికొక్కసారి వచ్చే తై అమావాస్య సందర్భంగా పంచామృతాభిషేకాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలం అమ్మణ్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

చిల్లకూరు : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గూడూరు డివిజన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. వారు బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డీఎస్పీ గీతాకుమారి, సీఐ శేఖర్‌బాబును కలిశారు. వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో ప్రార్థనలు జరుగుతున్న సమయాల్లో మైక్‌లపై నిషేధం విధించాలని పలువురు ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. తాము ఆదివారం మాత్రమే చర్చిల్లో మైక్‌ను వినియోగించుకుంటామని, దానిపైనా అభ్యంతరం చెప్పడం తగదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు కుమార్, పాస్టర్స్ యాకోబు, స్టీఫెన్ భరత్, దొరరాజు, పాలు, యాకోబు పాల్గొన్నారు.



డీఎస్పీని సత్కరిస్తున్న పాస్టర్లు

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు

రాపూరు: ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు పొందేందుకు ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భవాని తెలిపారు. వచ్చే నెల 8 నుంచి 14 వరకు దరఖాస్తులు పరిశీలన ఉంటుందని, అనంతరం మండల అధికారులు, బ్యాంకు అధికారులు క్షేత్ర పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఈడిగ కులస్తులకు మూడు మద్యం షాపులు

వెంకటగిరి రూరల్ : గీత కార్మికులైన ఈడిగ కులస్తులకు వెంకటగిరి నియోజకవర్గంలో అదనంగా మరో మూడు మద్యం దుకాణాలు కేటాయించినట్టు చిత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం వెంకటగిరిలో విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికులు, ఈడిగ కులానికి చెందిన వారికి 2024-25 సంవత్సరానికి సంబంధించి వెంకటగిరి మున్సిపాలిటీ-1, బాలాయపల్లి-1, డక్కిలి-1 మండలాలకు ఒక్కో మద్యంషాపు కేటాయించినట్టు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రూ. 21,66,667, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో రూ.18,33,334 లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏడాది లీజుకుగాను మున్సిపాలిటీ పరిధిలో రూ.35.75 లక్షలు, డక్కిలి, బాలాయపల్లి మండల పరిధిలో 30.25 లక్షలు చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈడిగ సబ్ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల చలానాను డీడీ రూపంలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. 7న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు ధ్వంసం చేశారని ఫిర్యాదు

చిట్టమూరు : తన పొలంలోని వరినాట్లను ధ్వంసం చేసినట్టు ఉప్పలమర్తికి చెందిన రైతు ఎర్రాబత్తిన దయాకర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ తాను 0.50 సెంట్ల భూమిలో వారం క్రితం వరినాట్లు వేసినట్టు తెలిపాడు. తన పొలం పక్కనే ఉన్న ఒక రైతు పాత కక్షలతో వరి నాట్లను పీకి బయట పడేశాడని పేర్కొన్నారడు. విచారించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

పట్టుకున్నారు.. వదిలేశారు



పోలీసులు వదిలేసిన లారీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తెల్లరాయిని తరలించే లారీని గూడూరు రూరల్ పోలీసులు పట్టుకుని తర్వాత వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెల్లరాయిని తరలించే విషయంలో కూటమి ప్రభుత్వం ఇటీవల కొన్ని మైన్లకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో అందరికీ కనిపించేలా లారీలో తీసుకుని పోతున్నారు. మంగళవారం అర్ధరాత్రి గూడూరు రూరల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టలు కట్టి వున్న లారీని పట్టుకున్నారు. దాన్ని స్టేషన్‌కు తరలించారు. ఏమైందో కానీ సరుకుతో పాటు లారీని బుధవారం మధ్యాహ్నం వదిలిపెట్టారు. సైదాపురం ప్రాంతంలో తెల్లరాయి తవ్వకాలకు అనుమతులున్నా, ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి తరలించే వారు అక్కడి ప్రజా ప్రతినిధికి టన్నుకు కొంత మొత్తాన్ని చెల్లించాలి. ఆ ప్రజాప్రతినిధి నుంచి రూరల్ పోలీసులకు తీవ్ర ఒత్తిడి రావడంతోనే లారీని వదిలేసినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తెల్లరాయి అక్రమ రవాణాకు అడ్డు అదుపూ లేకుండాపోయింది. దీనిపై రూరల్ సీఐ వివరణ ఇస్తూ లారీకి సంబంధించిన రికార్డులు ఉండడంతో వదిలేశామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఏళ్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయనను బుధవారం వెంకటగిరిలోని తన నివాసంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఆయన మాట్లాడుతూ కూటమి నేతల ఒత్తిళ్లకు లోనుకావొద్దని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. తప్పుడు కేసులకు భయపడొద్దన్నారు. తప్పుచేసిన ప్రతి అధికారీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి, డక్కిలి మండలాల అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, సుబ్బారావు, ఆటంబాకం శ్రీనివాసులు, వహిద, అల్లంసాయి, తలపల మల్లికార్జున్, రాజారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, యస్థానిబాషా, శ్రీనివాసరాజు, చీర్ల భాస్కర్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, యోగి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కొత్త విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలి

చిల్లకూరు : ఉపాధి హామీ పథకంలో అవకతవకలను నివారించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధాన్ని పటిష్టంగా అమలుచేయాలని ఏపీవో గిరి ఆదేశించారు. ఆయన బుధవారం కలవకొండ, తొణుకుమాల గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో గతంలోలాగే సెల్‌ఫోన్లో యాప్ ద్వారా కూలీల సంఖ్యను పంపాలన్నారు. గతంలో ఒక గ్రూప్‌లో ఒకరి ఫొటో తీసి సభ్యులందరికీ హాజరు వేసే వారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంత మంది సభ్యుల లెక్క చూపుతున్నారో అంత మంది ఆ ఫొటోలో ఉండాలని సూచించారు. అలా లేని పక్షంలో మస్టర్ తీసుకునే పరిస్థితి ఉండదన్నారు. తద్వారా మిగిలిన కూలీలకు వేతనాలు అందవని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఈ విధానంపై పూర్తిగా అవగాహన కలిగి కూలీల సంఖ్యను, ఫొటోను కచ్చితంగా అప్‌లోడ్ చేయాలన్నారు.



తొణుకుమాలలో మాట్లాడుతున్న ఏపీవో గిరి

భూ రీసర్వేకు నోటీసులు జారీ

వెంకటగిరి రూరల్ : మండలంలోని బాలసముద్రం గ్రామంలో రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం పైలెట్ గ్రామంగా ఎంపిక చేసింది. అధికారులు నాలుగు బృందాలను నియమించి సర్వే చేసేందుకు రైతులకు బుధవారం నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కార దిశగా అధికారులు చేపడుతున్న భూ రీసర్వే పక్రియ అభినందనీయమన్నారు. కొందరు దళారులు అటవీ పొరంబోకు భూమిని ఆక్రమించుకుని 1బి అడంగల్‌లో పేర్లు ఎక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

కండలేరులో 54.808 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 54.808 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఆరూరులో ఆధార్ క్యాంపు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గ్రామ సచివాలయంలో గురువారం ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డులతోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.